నేడు ఉచిత వైద్య శిబిరం

సైదాబాద్, ఏప్రిల్ 9: గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సైదాబాద్ డివిజన్ కళ్యాణ్ నగర్ లోని మెడిప్లేస్ హాల్ పై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగమల్ల అనిల్ కుమార్ ఒక ప్రకటన తెలిపారు. అవేర్ హాస్పిటల్ , పాణనీయ డెంటల్ హాస్పిటల్ అగర్వాల్ ఐ హాస్పిటల్ లకు చెందిన వైద్యులు బీపీ,షుగర్, నేత్ర, దంత వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర కాలనీవాసులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి: కార్పొరేటర్

పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

వనస్థలిపురం, ఏప్రిల్ 9:డివిజన్‌లోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం సత్యసాగర్ కాలనీలో పర్యటించి కాలనీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పార్కులు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శాతవాహన నగర్ కాలనీలో రూ.28.80లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ భవనాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజ్‌కుమార్, ఓబీఆర్ కుమార్, బాలకృష్ణ, నందిరాజు లక్ష్మీనారాయణ, మహేష్‌గౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నాలాలో పూడికతీత పనుల పరిశీలన

పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, ఏప్రిల్ 9: సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వర్ బజార్ హనఫీయా మసీదు వద్ద నాలా పూడిక తీత పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నాలా పూడిక తీయకపోవడం వలన వర్షాలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వరద వస్తున్నదని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పూడికతీత పనులకు అడ్డుగా ఉన్న కరెంట్ తీగలను విద్యుత్ సిబ్బంది తో, చెట్ల కొమ్మలను, జీహెచ్ఎంసీ, హార్టికల్చర్ సిబ్బందితో తొలగింప చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, స్థానిక నాయకులు చంద్రయ్య, నాగరాజు, కిషోర్ పాల్గొన్నారు.

పూడికతీతపై లేదు శ్రద్ధ..

- మురికి కూపంగా నాలాలు.. డ్రైయిన్లు
- చిన్నపాటి వర్షానికే వరదనీరు రోడ్లపై పరుగు
- ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో దుస్థితి

సరూర్‌నగర్ చెరువు దిగువన తూముల వద్ద పేరుకుపోయిన చెత్త, చెదారం

ఎల్బీనగర్, ఏప్రిల్ 9: ఎల్బీనగర్ జోన్‌లోని హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో పూడికతీత పనులు ప్రారంభం కాలేదు. చాలా ప్రాం తాల్లో డ్రైయిన్లు, నాలాలు పూడుకుపోయాయి. వ్యర్థాలన్నీ పేరుకుపోయినా కనీసం సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు ఈ దిశలో ఆలోచన చేయడం లేదు. ముందస్తుగా ప్రతిఏటా ప్రణాళికలు చేస్తున్నా అందుకు అనుగుణంగా లక్ష్యాలను చేరడంలో మాత్రం విఫలం అవుతున్నారు. నాలాలను పూడిక తీశామని, డ్రైయిన్లు క్లీనింగ్ చేశామంటూ బిల్లులు పెట్టడం తప్పిస్తే పూర్తిస్థాయిలో ఈ పనులపై పర్యవేక్షణ కరువు అవుతోందన్న విమర్శలు ప్రతిసారీ విన్పిస్తూనే ఉన్నాయి. ఈ పనులను చేపడుతున్న కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కు కావడంతోనే ఈ పనుల్లో లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మూడు సర్కిళ్ల పరిధిలో ప్రతియేటా వర్షాకాలానికి ముందు పూడికతీత పనుల కోసం నిధులు మంజూరు అవుతున్నా అవి అనుకున్న రీతిలో పనులు జరుగడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఏప్రిల్ మాసం వచ్చినా పూడికతీత పనులకు అధికారులు ఇంకా శ్రీకారం చుట్టలేదు. ఈ పనులపై ప్రతియేటా ముందస్తుగానే ప్రణాళికలు చేస్తున్నా అందుకు అనుగుణంగా పక్కాగా పనులను చేయడం లేదని ఆయా ప్రాంతాల ప్రజల నుండి కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రధానంగా చైతన్యపురి నాలా, సరూర్‌నగర్ చెరువు కట్ట తూముల వద్ద నాలాలను ఒక్కసారి పరిశీలిస్తే వ్యర్థాలు పేరుకుపోయి కనీసం ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవని స్పష్టం అవుతోంది. సాదారణంగా చెరువు నుండి నాలాలోకి కలిసే నీరు సాఫీగా వెళ్లేలా ఈ ప్రాంతాన్ని క్లీన్ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడ డపింగ్ యా ర్డుగా మారిన దుస్థితిని నిత్యం ఈ దారిలో వెళ్తున్న సం బంధిత అధికారులు పరిశీలిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు కన్పించం లేదు. ఈ విషయంలో ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ఈ ఏడాదైనా పూడిక తీత పనులను త్వరగా ప్రారంభించి పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, ఏప్రిల్ 9: ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం నాలుగు లక్షలకు దరఖాస్తులు చేసుకుంటే కేవలం పద్దెనిమిది వేలు మాత్రమే ఇవ్వడం బాధాకరమని మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారుడికి అందించే సీఎం సహాయనిధి సంతృప్తికరంగా లేదన్నారు. బాధితుడి కున్న సమస్యను గుర్తించి సీఎం సహాయనిధి నుంచి లబ్ధిదారుడికి న్యాయం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రామిడి రామ్ రెడ్డి, అర్కల కామేష్ రెడ్డి, సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, జలాల్పూర్ సునీత బాలరాజ్, నిర్మల, లలిత, లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, గిరీష్, బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న సరిత

కందుకూరు, ఏప్రిల్ 9: రాజీవ్ యువశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సభావత్ సరిత తెలిపారు .బుధవారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యువ వికాస్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, యువతీ, యువకులు 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని కార్పొరేషన్లకు సంబంధిత మార్గదర్శకాలను జారీ చేసినట్లు చెప్పారు .ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు రేషన్ కార్డు ఉంటే సరిపోతుందని, ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని స్పష్టం చేశారు . కాగా రేషన్ కార్డు లేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించవలసి ఉంటుందని తెలిపారు .ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకొని సంబంధిత పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాల,ని లేదా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు అభినందనీయం

సూర్య నగర్ కాలనీలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 9:సొంత నిధులతో కాలనీవాసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని హయత్ నగర్ డివిజన్ సూర్య నగర్ కాలనీవాసులు తమ సొంత నిధులు దాదాపు రూ.3 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీ.సీ.కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్క అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మీద ఆధారపడ కుండా తమ స్వంత నిధులతో సీ.సీ. కెమెరాలు ఎర్పాటు చేసుకోవడం నిజంగా గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఎల్బీనగర్ ను నేర రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యమని, అందుకు అనుగుణంగా నియోజకవర్గంలో దశల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తు న్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని కాలనీల్లో ప్రజలు తమ వంతు విధిగా సీ.సీ.కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీ.సీ.కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, బీఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, మల్లేష్ ముదిరాజ్, భాస్కర్ సాగర్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిన బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్, ఏప్రిల్ 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసారని మాజీమంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం మండలం ఎండి తండాకు చెందిన బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారందరికీ గులాబీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం ద్వారానే బీజేపీలో పనిచేస్తున్న చాలామంది నాయకులు బీఆర్ఎస్ గూటికి వస్తున్నారని ఆమె తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విఫలం చెందాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఇస్తున్న హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చడం లేదన్నారు. రాబోయే రోజులలో ప్రజలు ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్తారని ఆమె జోస్యం చెప్పారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగోత్ జాంపుల నాయక్, ఆనంద్ నాయక్, భాస్కర్, సంజీవ, ,అర్జున్ తదితరులు ఉన్నారు.

11న బీజేఆర్ భవన్‌లో మహనీయుల ఉత్సవాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మన్సురాబాద్, ఏప్రిల్ 9: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయులైన మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బీపీ మండల్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంఘాల నేతలు పంజాల జైహింద్ గౌడ్, చామకూర రాజు తెలిపారు.

ఈనెల 11న కొత్తపేటలోని బీజేఆర్ భవన్లో నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు, బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఎల్బీనగర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 11న బీజేఆర్ భవన్ లో నిర్వహించనున్న ఉత్సవాలకు రాజకీయ నాయకులు, కుల సంఘాలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ గౌడ్, వీరమల్ల లింగయ్య గౌడ్, ఆప్కా గజేంద్ర యాదవ్, వాసు కె యాదవ్, వేముల కొండల గౌడ్, బోయపల్లి లింగస్వామి, నకిరే కంటి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కమిషనర్‌కు సేవా పురస్కారం

పురస్కారం అందుకుంటున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్, ఏప్రిల్ 9: భద్రత, రక్షణ చర్యలలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతికి సేవా పురస్కారం అవార్డును శంషాబాద్ లో ఉన్న రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ విమాన ఆశ్రయం వారు అందజేశారు. సిబ్బంది అందరి సహకారంతోనే సేవా కార్యక్రమంలో అవార్డు రావడం జరిగిందన్నారు. ఈ పురస్కారంతో మరింత రెట్టింపు పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, బి నాగేశ్వరరావు, వేణుగోపాల్ రెడ్డి, డి ఈ వెంకన్న, ఏఈ వినీల్ గౌడ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వంకాయల యాదగిరి ఉన్నారు.

కనీవిని ఎరుగని రీతిలో రజతోత్సవ మహాసభ : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

మన్సురాబాద్, ఏప్రిల్ 9: వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు ప్రజలను పెద్ద ఎత్తున తరలించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. ఈనెల 27న వరంగల్ లో నిర్వహించనున్న బీ ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నేపథ్యంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని బుధవారం మనసురాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈ రెడ్డి గార్డెన్లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కార్యకర్తలు, నాయకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కనీవిని ఎరుగని రీతిలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ జరగబోతుందని తెలిపారు. వరంగల్ మహాసభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసే ప్రసంగంపై ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, సాగర్ రెడ్డి, జిన్నారం విట్టల్ రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, తూర్పాటి చిరంజీవి, కటిక రెడ్డి అరవింద్ రెడ్డి, ఆనంద్ యాదవ్, పారంధ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

కందుకూరు, ఏప్రిల్ 9: మండల పరిధిలోని చిప్పలపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లల్లో విలువైన వస్తువులు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్సార్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభాలపై మంటలు వ్యాపించడంతో ఇండ్లలో షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల విలువైన వస్తువులతో పాటు ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు. స్విచ్ బోర్డులు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి కావడంతో ఇళ్లల్లో ఉన్న ప్రజలు భయంతో బయటికి పరుగు తీశారు. కాగా ప్రాణం నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తి విలువ దాదాపు రూ.25 లక్షల వరకు ఉంటుందని గ్రామస్తులు వివరించారు. జరిగిన సంఘటనను పరిశీలించి న్యాయం చేయాలని విద్యుత్ అధికారులను కోరారు.

రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర

పులిమామిడిలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అనిత రెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 9: భారత అత్యున్నత రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ కుట్ర చేస్తోందని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి తెలిపారు. జై బాపు ,జై భీమ్, జై సవిధాన్ కార్యక్రమంలో భాగంగా పులిమామిడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, మన చరిత్ర, మన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర బీజేపీ చేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఎండ కట్టారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలి

కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు చేస్తోందని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి , మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు తెలిపారు. కొత్తగూడ ,జైత్వారం, గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొక్క భూపాల్ రెడ్డి గ్రామశాఖ అధ్యక్షుడు బి.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ఆయుష్‌లో వర్క్‌షాప్

వర్క్ షాప్‌లో చర్చిస్తున్న ఇన్చార్జి డైరెక్టర్ జీపీ ప్రసాద్, తదితరులు

సైదాబాద్, ఏప్రిల్ 9 : సైదాబాద్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఆయుష్) లో ఐదు రోజుల పాటు 'టాంజిబుల్, ఇంటాంజిబుల్ ఎవిడెన్స్ ద్వారా ఆయుర్వేద చారిత్రక వస్తువుల' ప్రదర్శిన అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి డైరెక్టర్ జీపీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వర్క్‌షాప్‌లో పలువురు పాల్గొని పోర్టల్ మోనోగ్రాఫ్‌లను ఖరారు చేయడానికి తమ విలువైన సూచనలను అందించారని, రాబోవు ప్రచురణలకు సూచనలు, సవరణలు చేయడానికి తమ విలువైన సేవలను అందించారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ టి. సాకేత్ రామ్, రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్ ఎస్. మానే, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ శ్మరళీ మనోహర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (ఆర్కియాలజీ) బి. రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల కమిటీని వ్యతిరేకిస్తున్నాం

రామంతాపూర్, ఏప్రిల్ 9: హెచ్‌సీయూ భూముల వివాదంపై ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న కమిటీకి తాము వ్యతిరేకమని ఏబీవీపీ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ ప్రతినిధి అఖిల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ కార్యకర్తల కమిటీ మాత్రమే అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని రద్దుచేసి నూతనంగా నిపుణులతో కూడిన కమిటీని వేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి ఆత్మహత్య

హయత్ నగర్‌లోని రిలయన్స్ మార్ట్ వద్ద మృతుడి రక్తపు మడుగు

హయత్ నగర్, ఏప్రిల్ 9: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ముదిరాజ్ కాలనీకి చెందిన సంపంగి నాగేశ్(25), శిరీష(20) భార్యాభర్తలు. వీరికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పది నెలల బాబు ఉన్నాడు. దంపతులిద్దరూ జీహెచ్ఎంసీ ఆటో రిక్షాను నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. భార్య భర్తలిద్దరీ మధ్య కుటుంబ కలహాల కారణంగా భార్య శిరీష మంగళవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు భర్త నాగేశ్‌ను హయత్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. సాయంత్రం బంధువులు జామీను పై అతడిని ఇంటికి తీసుకెళ్ళారు. బుధవారం తెల్లవారు జామున నాగేశ్ ఇంటి నుండి బయటకు వెళ్లి హయత్ నగర్ కుంట్లూరు రోడ్డులో ఉన్న రిలయన్స్ డిజిటల్ షాపింగ్ మాల్స్ ఎదుట రక్తపు మడుగులో మృతి చెంది పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న హయత్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నాగేశ్ ను హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేశారా...? లేదా అక్కడే హత్య చేశారా? ఆత్మహత్య చేసుకున్నాడా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి తలకు, చేతులకు, కాళ్లకు కత్తి గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీమ్ తో ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.